# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 02-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1 కేంద్ర శాస్త్ర సాంకేతికశాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ వైయస్సార్ జిల్లాలో పర్యటించి.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఈరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు.**

**2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈరోజు సమావేశమైంది.**

**3. విజయవాడలో 35వ పుస్తక మహోత్సవాన్ని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈ రోజు ప్రారంభిస్తారు.**

**4. మహా కుంభమేళాకు వెళ్లే యాత్రికుల కోసం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ వెల్లడించింది.**

**5. రహదారి నియమాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా మోటారు వెహికిల్ ఇన్ స్పెక్టర్ మహమ్మద్ అలీ తెలిపారు.**

==========================

కేంద్ర శాస్త్ర సాంకేతికశాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ వైయస్సార్ జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా జిల్లా స్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. కేంద్రమంత్రి పర్యటనపై వైయస్సార్ జిల్లా ఆకాశవాణి ప్రతినిధి బి. శ్రీనాథ్ రెడ్డి మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమైంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రివర్గం చర్చిస్తోంది. రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి–ఎస్ఐపిబి ఆమోదించిన లక్షా 82 వేల 162 కోట్ల రూపాయల పెట్టుబడులపై చర్చించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రామాయపట్నంలో నిర్మించనున్న బీపీసీఎల్ చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటు, విశాఖపట్నంలోని మిలీనియం టవర్స్‌కు, మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

విజయవాడలో ఈరోజు నుంచి 35 వ పుస్తక మహోత్సవం ప్రారంభంకానుంది. ఈ పుస్తక మహోత్సవాన్ని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈరోజు సాయంత్రం ప్రారంభిస్తారు. నగరంలోని ఇందిరాగాంధీ మైదానంలో ఈనెల 12వ తేదీ వరకు 11 రోజుల పాటు జరిగే ప్రదర్శనలో రెండు వందలకు పైగా స్టాళ్లను ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 9 గంటల వరకు పుస్తక ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కాగా ఈనెల 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

-------------------------

రహదారి నియమాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్టీఆర్ జిల్లా మోటారు వెహికిల్ ఇన్ స్పెక్టర్ మహమ్మద్ అలీ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈరోజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహమ్మద్ అలీ పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్...30 సెకన్లు

-------------------------

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ –ఆర్జీఎస్ఏ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు, ఉద్యోగులకు పరిపాలన వ్యవహారాలు, పథకాలపై శిక్షణ అందించడంలో జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండో స్థానంలో నిలిచిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి కె. పవన్ కల్యాణ్ వెల్లడించారు. 2024 ఏప్రిల్ 1 నుంచి డిసెంబరు మధ్య 2 లక్షల 56 వేల 138 మందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. శిక్షణ లక్ష్యాలు చేరుకోవడంలోనూ జాతీయ స్థాయిలో 85.35 శాతంతో మూడో స్థానంలో నిలిచిందని. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఈ విజయాలు రాష్ట్రానికి గర్వకారణమని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ మార్గదర్శకత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంతోనే ఇది సాధ్యమైందని ఎక్స్‌లో తెలిపారు.

-------------------------

మహా కుంభమేళాకు వెళ్లే యాత్రికుల కోసం పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి–బనారస్ ప్రత్యేక రైలు జనవరి 18, ఫిబ్రవరి 8, 15, 22వ తేదీల్లో శనివారం రాత్రి తిరుపతిలో బయల్దేరి దువ్వాడ మీదుగా సోమవారం మధ్యాహ్నం బనారస్ చేరుకుంటుందని తెలిపారు. జనవరి 20, ఫిబ్రవరి 10, 17, 24వ తేదీల్లో ఈ రైలు తిరుగు ప్రయాణమవుతుందని చెప్పారు. అలాగే నరసాపూర్–బనారస్ ప్రత్యేక రైలు జనవరి 26, ఫిబ్రవరి 2వ తేదీల్లో ఆదివారం ఉదయం 6 గంటలకు నరసాపూర్‌లో బయల్దేరి సోమవారం మధ్యాహ్నం గంటలకు బనారస్ చేరుకుంటుందని, జనవరి 27 ఫిబ్రవరి 3వ తేదీల్లో సోమవారం సాయంత్రం బనారస్ తిరుగు ప్రయాణమవుతుందని తెలిపారు.

-------------------------

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా విద్యుత్ బిల్లులను ఆదా చేసుకోవచ్చని యూనియన్ బ్యాంకు డిప్యూటీ ప్రాంతీయ అధికారి ఐఎస్సెస్ మూర్తి పేర్కొన్నారు. ఈ పథకంపై విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో ఈరోజు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి పాత్రికేయులతో

మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీతో ప్రతి ఒక్కరు తమ ఇంటి పైకప్పుపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

వాయిస్ .. 35 సెకన్లు

---------------------------

బాల్య వివాహాలను నియంత్రించడమే లక్ష్యంగా 'కిశోరి వికాసం' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథక సంచాలకులు లక్ష్మీ భార్గవి తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ వాత్సల్య పథకం కింద కిశోరి వికాసం కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ భార్గవి మాట్లాడుతూ, బాల్య వివాహాల నియంత్రణకు పెనుగంచిప్రోలు మండల వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు, శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

వాయిస్..30 సెకన్లు

---------------------------

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం అదనపు కార్యనిర్వహణాధికారి వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలో జరుగుతున్న వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లను ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం వెంకయ్య చౌదరి పాత్రికేయులతో మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు తిరుమల ఆలయంలోని వైకుంఠ ద్వారాలను తెరవనున్నామని చెప్పారు. భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించడంతో పాటు రద్దీకి అనుగుణంగాఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుతం వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 20 సెకన్లు...

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని బృందం ఈనెల 20వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు దావోస్‌లో పర్యటించనుంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరగనున్న 'వరల్డ్ ఎకనామిక్ ఫోరం-2025' సదస్సుకు ముఖ్యమంత్రి నేతృత్వంలోని ఆంధ్ర ప్రదేశ్ బృందం హాజరు కానుంది. ఈ మేరకు సదస్సుకు హాజరయ్యేందుకు అవసరమైన ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ సదస్సుకు ముఖ్యమంత్రితో పాటు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పలువురు అధికారులు హాజరు కానున్నారు.

======================